సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 17 । జనవరి । 2025



అంతర్ రాష్ట్ర బస్సు బోల్తా

మదనపల్లె సమీపంలోని అంగళ్లు–జంగావారిపల్లె మార్గంలో మార్కాపురం–బెంగళూరు ప్రైవేటు బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 11 మంది గాయపడ్డారు. -8లో



మా బిడ్డ మృతదేహం వెలికితీయరా!

ఈతకెళ్లి మృతి చెందిన యువ ఇంజినీర్ వెంక టరత్నం మృతదేహాన్ని రెండురోజులైనా పోలీసులు వెలికితీయలేదు. దీంతో ఆగ్రహించిన బంధువులు ధర్నా చేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.170	రూ.220
రెండోరకం	రూ.110	రూ.160

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 48 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు గంగమ్మ జాతర వేలంపాట

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ జాతర ఫిబ్రవరి 28, మార్చి 1,2వ తేదీల్లో జరగనుంది. ఈ సందర్భంగా మూడు రోజుల తలనీలాలు, విడి దినాల్లో అంగళ్లు, టోల్‌గేట్లు, టెంకాయలు, పూల సామాగ్రి, షామియానా సపరేట్ దుకాణాలు కలిపి వేలం పాటలకు సరియైన స్పందన రానందున శుక్రవారం మళ్లీ వేలం పాటను నిర్వహిస్తామని ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు తెలిపారు. దేవాదాయశాఖ వారి ఆధ్వర్యంలో జరిగే వేలంపాటలో పాల్గొనదలచిన వారు రూ. 50 వేలు నగదును ముందుగా డిపాజిట్ చేయాలన్నారు. శుక్రవారం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలంపాట జరుగుతుందని ఈఓ తెలిపారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం బీటీ కాలేజీ హాకీ మైదానంలో శుక్రవారం నుంచి 14వ ఏపీ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ది అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం 3 గంటలకు ప్రారంభమయ్యే పోటీలకు ఎమ్మెల్యే షాజహాన్ బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలు 19వతేదీ వరకు జరుగుతాయన్నారు. 21 జట్లు పాల్గొంటాయని తెలిపారు. హాకీ మైదానాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. క్రీడాకారుల వసతి ఏర్పాట్లు చేశారు. హాకీ మైదానం క్రీడాకారులతో సందడి నెలకొంది.

వైభవంగా పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో పీరయ్యస్వామి సమాధి

చిన్నమండెం: మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామం పీరయ్యమఠంలో 219 సంవత్సరాల క్రితం సజీవ సమాధి అయిన పీరయ్య స్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 15 నుంచి రెండు రోజుల పాటు నాలుగో పీఠాధిపతి మఠం నాగలింగమయ్య ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చెక్కభజన, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువారం ఉదయం మౌలాలి జెండా ఊరేగింపు వైభవంగా సాగింది. ఆరాధనోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పీరయ్య స్వామిని దర్శించుకున్నారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం , నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 18వ తేదిన కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఫాతిమా మెడికల్ కళాశాలలో పీఆర్‌ఓ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. అలాగే అదే కళాశాలలో ఓటీ ఇన్‌చార్జి, నర్సింగ్ సూపర్‌వైజర్, ఓటీ టెక్నిషియన్, స్లీప్ ల్యాబ్ టెక్నిషియన్ స్టాఫ్ నర్సులు తదితర ఉద్యోగాలు కూడా ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అలాగే బీఎఫ్ఐఎల్ సంస్థలో లోన్ ఆఫీసర్ ఉద్యోగానికి సైతం ఎంపికలు నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఇంటర్‌తోపాటు ఏఎన్ఎం, డిప్లొమా ఇన్ అనిస్థిషియా, ఓటీ స్పీచ్, ఫార్మసీ, డీఎంఎల్‌టీ, డిప్లొమా ఇన్ ఆప్తామాలజీ డిగ్రీ, పీజీతోపాటు సంబంధిత విద్యార్హతలు కలిగి 18 నుంచి 40 ఏళ్ల పైబడి కలిగితన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదానుబట్టి రూ. 12–35 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు తమ విద్యార్హతలు, ఇతర ధ్రువపత్రాలు, ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని ఆయన సూచించారు.

మోసగాళ్ల మాటలు నమ్మొద్దు

కడప రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్ల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. తమ శాఖ జోన్–4 పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సు, ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగాలకు దరఖాస్తు ప్రక్రియ జరుగుతోందన్నారు. ఇందుకు సంబంధించి ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు అడిగితే అలాంటి వారి మాటలు ఎవరూ నమ్మరాదన్నారు.

మోసపూరిత మాటలు నమ్మవద్దు

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పేవారి మాటలు నమ్మవద్దని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. అశోక్ అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామని సెల్‌ఫోన్ ద్వారా అభ్యర్థులను మభ్యపెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కేవలం మెరిట్‌ఆధారంగానే ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపడతామని స్పష్టం చేశారు.

నీలగిరి.. నింగినంటి..

- హార్సిలీహిల్స్‌పై 1859లో నాటిన మహా నీలగిరి వృక్షం ఎత్తు, మొదలు పెరిగింది
- 1995లో కేంద్ర మహావృక్ష పురస్కారం
- ఏపీలోనే పురాతన నీలగిరి వృక్షంగా రికార్డు
- 1995లో దీని ఎత్తు 40 మీటర్లు, చుట్టు కొలత 4.7మీటర్లు
- తాజాగా చుట్టు కొలత 6.36మీటర్లు.. ఎత్తు 43 మీటర్లు



శాఖోపశాఖలుగా విస్తరించిన 165 ఏళ్ల మహానీలగిరి వృక్షం (ఇన్‌సెట్) నీలగిరి వృక్షం మొదలు (ఫైల్)

SAKSHI SPECIAL

బి.కొత్తకోట: 1859లో బ్రిటీష్ పాలనలో ఓ కలెక్టర్ నీలగిరి నాటిన మొక్క ఇంతై..ఇంతింతై అన్నట్టు ఎదుగుతోంది. 1995లో మహావృక్ష పురస్కారంతో పాటు రూ.50వేల నగదు బహుమతి పొందిన ఈ మహావృక్షం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉంది. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ మహానీలగిరి వృక్షం తాజా లెక్క ప్రకారం ఎత్తు, మొదలు ఆమాంతం పెరిగింది. ఇదీ ఇంకా పెరుగుతుందని అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఈ ఆసక్తికర నీలగిరి మహావృక్షం వివరాల్లోకి వెళ్తే...బ్రిటీష్ పాలనలో ఉమ్మడి కడపజిల్లా కలెక్టర్‌గా డబ్ల్యూడీ హార్సిలీ పని చేస్తున్న కాలంలో ఆయన హార్సిలీహిల్స్‌ను కనుగొన్న విషయం అందరికి తెలిసిందే. కొండపై విడిది చేసుకుని ఓ అతిథిగృహం నిర్మించుకున్న ఆయన ఆ గది పక్కనే ఓ నీలగిరి మొక్కను 1959లో నాటారు. ఆయన నాటిన ఆ మొక్క ఇంతై..ఇంతింతై అన్నట్టుగా ఎదిగి రికార్డులకెక్కుతుందని ఆనాడు భావించి ఉండరేమో. ఇప్పుడిది రికార్డును సృష్టిస్తోంది. వయసు పెరిగేకొద్దీ తరిగిపోతారు. అయితే ఈ నీలగిరికి ఏళ్లు పెరిగేకొద్దీ అందరూ తలెత్తి చూసేలా ఎత్తుకు ఎదుగుతూ శాఖోపశాఖలుగా విస్తరిస్తూ ఆక్షరిస్తోంది. 1995 నాటికి ఉమ్మడి ఏపీలో పురాతన, అతి ఎత్తయిన వృక్షంగా గుర్తింపు పొంది రికార్డును సొంతం చేసుకుంది. 2000 మార్చి 16న అప్పటి కేంద్ర ప్రభుత్వం దీనికి మహా వృక్ష పురస్కారం అవార్డును, రూ.50వేల నగదును బహుమతిగా అందించారు. దీనిని అప్పటి చిత్తూరు డీఎఫ్ఓ, మదనపల్లె ఎఫ్ఆర్‌ఓలు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. 2000లో అప్పటి లెక్క ప్రకారం ఈ మహానీలగిరి వయసు 141 ఏళ్లు, ఎత్తు 40 మీటర్లు, చుట్టు కొలత 4.7 మీటర్లు (15.6 అడుగులు). తాజా లెక్కల ప్రకారం ఈ లెక్క మారింది. ఇప్పుడు దీని వయసు 165 ఏళ్లు. ఎదిగిన ఎత్తు 43 మీటర్లు (అంచనా), అంటే మూడు మీటర్ల ఎత్తు పెరిగింది. కాగా ప్రస్తుతం చుట్టు కొలత 6.32 మీటర్లు. అంటే 20.10 అడుగుల చుట్టు కొలత ఉంది. 2000 ఏడాది నుంచి ఇప్పటి వరకు పెరిగింది 1.66 మీటర్లు, అంటే 5.44 అడుగులు పెరిగింది. ఇదే కొలత ఛాతీ ఎత్తులో అయితే చుట్టు కొలత 6.25 మీటర్లు. అంటే 20.6 అడుగులు అవుతుంది. ఈ లెక్క తీసుకున్నా 1.55 మీటర్లు పెరిగింది. అంటే 5.08 అడుగులు పెరిగినట్టు లెక్క స్పష్టం. ఇప్పటిలెక్క ఇదికాగా వయసు పెరిగేకొద్ది ఇంకెంత ఎదుగుతుందో.

ఇంకా విస్తరిస్తూ..

మహానీలగిరి వృక్షం గతంలో కంటే ప్రస్తుతం శాఖోపశాఖలుగా విస్తరించింది. వృక్షం కొద్దిగాపైన అటుఇటు సాగిన కొమ్మల్లో కొన్ని ఎండి రాలిపోయినప్పటికి పైకి వెళ్లే కొమ్మలు, అంచున చిగురిస్తూ ఎత్తుకు ఎదుగుతున్నాయి.



2000లో మహావృక్ష పురస్కారం అందుకున్న అప్పటి డీఎఫ్ఓ, ఎఫ్ఆర్ఓ (ఫైల్)

కొండ నిండా నీలగిరి

హార్సిలీహిల్స్‌పై అత్యధికంగా కనిపించేది యూకలిప్టస్ (నీలగిరి) వృక్షాలే. ఈ కొండపై ఏపుగా పెరిగిన నీలగిరి వృక్షాల సందర్శకులకు ప్రత్యేక ఆక్షరణగా నిలుస్తాయి. ఇక్కడ విశేషంగా ఎదిగిన ఈ వృక్షాలపై అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని స్థానికులు గుర్తు చేస్తున్నారు. తొమ్మిది కిలోమీటర్ల ఘాట్‌రోడ్డుపై ఎత్తయిన నీలగిరి వృక్షాలు అలరిస్తాయి. హార్సిలీహిల్స్‌ను అధికారిక విడిదిగా చేసుకునేందుకు కడప కలెక్టర్ హార్సిలీ లేఖ పంపగా మద్రాసు ప్రభుత్వం దీనికి ఆమోదం తెలుపుతూ 1869 మే 4న జీవోఎంఎస్ నంబర్ 11579ను జారీచేసింది. అంతకుముందు గుర్రంపై కొండపైకి వచ్చిన హార్సిలీ మొక్కను నాటారు. తర్వాత అతిథి గృహం నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరగా రిజర్వ్ ఫారెస్ట్‌లో బంగ్లా నిర్మించుకునేందుకు 1869 జూన్ 9న జీవోఎంఎస్ నంబర్ 4162ను జారీచేసింది.

వెళ్లొస్తాం.. మళ్లొస్తాం

- పల్లెల నుంచి పట్టణాలకు తిరుగు ప్రయాణంలో ప్రజలు



ప్రయాణీకులతో రద్దీగా ఉన్న రాయచోటి బస్టాండ్

రాయచోటి: సంక్రాంతి పండుగ ముగిసింది. సుదూర ప్రాంతాల నుంచి జిల్లాలోని సొంత ఊర్లు, బంధువుల ఇళ్లకు వచ్చినవారు బుధవారం కనుమ పండుగను ముగించుకొని అదేరోజు సాయంత్రం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్లు, ప్రధాన రహదారులపై నాలుగు చక్రాల వాహనాల రద్దీ అధికమైంది. మూడు, నాలుగు రోజులు సంతోషంగా గడిపిన రోజులను జ్ఞాపకాలుగా ఉంచుకొని బయలుదేరారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, చెన్నై ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకోసం ఆర్టీసీ, ప్రైవేటు వారు ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నారు. ప్రత్యేక వాహనాల్లో సైతం ప్రయాణికులు నిండిపోయారు. జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపినట్లు జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి రాము తెలిపారు. తిరుగు ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈనెల 19వ తేదీ వరకు కొన్ని ప్రత్యేక వాహనాలను నడుపుతున్నామన్నారు.



కడపలో...

జంప్ రోప్‌లో ఆశాకిరణం ప్రసన్న

వేంపల్లి: వైఎస్ఆర్ జిల్లా వేంపల్లె మండలానికి చెందిన రామిరెడ్డి ప్రసన్న జంప్ రోప్‌లో ప్రతిభ చూపి అందరి ప్రశంసలు పొందింది. ముతుకూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి, రామలక్షుమ్మల కుమార్తె రామిరెడ్డి ప్రసన్న విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తిని కనబరిచేది. ప్రసన్న క్రీడా ప్రతిభను గుర్తించిన సింహాద్రిపురం మండలం కస్తూర్బా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఆమెను ప్రోత్సహించి క్రీడల్లో ప్రతిభ చూపే విధంగా తీర్చిదిద్దారు. అప్పటినుంచి జంప్ రోప్‌లో రాణిస్తూ జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు గుర్తింపు పొందింది. ఇటీవల నేపాల్‌లో జరిగిన ప్రపంచస్థాయి ఆటగాళ్లతో పోటీపడి తన సత్తా చాటి మొదటి స్థానంలో గోల్డ్ మెడల్ సాధించింది. పేద రైతు కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. దాతలు చేయూతనందిస్తే జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి కూడా మంచి పేరు తెస్తుందని పలువురు క్రీడాకారులు అంటున్నారు.



నేపాల్‌లో జరిగిన జంప్ రోప్‌లో రాణించిన ప్రసన్న (ఫైల్)

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం.. యువతకు సువర్ణావకాశం

కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి (జగదాంబసెంటర్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. గురువారం ఈ పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మక కంపెనీల్లో పని అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం లభిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు శ్రీనివాసులురెడ్డి 7799587687 నంబర్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం లింక్: https://pminternship.mca.gov. in/ login

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి

రాయచోటి: ప్రభుత్వ గృహ నిర్మాణ లేఔట్‌లలో ఇండ్ల నిర్మాణ ప్రగతితోపాటు మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం, ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న గృహనిర్మాణ లేఔట్లలో జరుగుతున్న పనులను జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలనీలలో మంజూరైన గృహాలు ఎన్ని, ఎన్ని పూర్తయ్యాయి. ఆర్సీ, ఆర్ఎల్‌లో ఉన్నవి ఎన్ని, వివిధ దశల్లో ఉన్న గృహాల సంఖ్య ఎంత అని కలెక్టర్ హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ అంశాలపై అధికారులతో చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఈ దయాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ డిఈ సహదేవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ గుణశేఖర్ పిళ్లై, హౌసింగ్ డీఈ సుబ్బరామయ్య, ఏఈ రామ్మోహన్ రెడ్డి, తహశీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీడీఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

రాయచోటి: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుంచి పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన, ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. రోజుకు ఐదు దరఖాస్తులను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రతి మండల కార్యాలయం నుంచి ఈ ఆఫీసులోనే జిల్లా కేంద్రానికి ఫైల్స్ పంపాలని కలెక్టర్ సూచించారు. వీసీలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, వైఖోమ్ నదియా దేవి, డ్వామా పీడీ వెంకటరత్నం, పిఆర్ ఎస్ఈ దివాకర్ రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్లు విడుదల

రాయచోటి టౌన్: జాతీయ రహదారి వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో నేషనల్ రోడ్ షేఫ్టీ నెలగా గుర్తిస్తూ జాతీయ రహదారి మాసోత్సవాలు–2025 బ్యానర్లు, బుక్‌లెట్లు, బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు రహదారి నియమ నిబంధనలు పాటించాలని చెప్పారు.

గడువు పొడిగింపునకు అవకాశం

కడప రూరల్: జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల దరఖాస్తుల తేదిని త్వరలో ప్రకటిస్తామని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయసింహా తెలిపారు. వాస్తవానికి దరఖాస్తు ప్రక్రియ ఈనెల 16వ తేది నాటికి ముగిసిందన్నారు. ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో చాలా మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. తిరిగి దరఖాస్తు చేసుకునే తేదిని త్వరలో ప్రకటిస్తామని, ఈ అంశాన్ని అభ్యర్థులు గమనించాలని సూచించారు.

విభిన్న క్రీడ ఉడ్‌బాల్





ఉడ్‌బాల్ క్రీడను ప్రారంభిస్తున్న కోచ్



రాష్ట్ర స్థాయి ఉడ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: ఉడ్‌బాల్‌కు ఆదరణ పెరుగుతోంది. విభిన్నమైన ఈ క్రీడవైపు యువత మొగ్గు చూపుతోంది. గడ్డి, ఇసుక మైదానాలతో పాటు ఇండోర్‌లో సైతం ఆడుకునే వెసులుబాటు ఉంది. 2008లో ఒలింపిక్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ క్రీడను ఆసియా బీచ్ గేమ్స్‌లో చేర్చింది. అప్పటి నుంచి మన దేశంలో ఉడ్‌బాల్‌కు ప్రేక్షకాదరణ క్రమేణా పెరుగుతోంది.

వినూత్న క్రీడ

ఉడ్‌బాల్ ఒక వినూత్న క్రీడ. ఇది గోల్ఫ్‌కు రిక్రియేషన్ లాంటిది. ఈ క్రీడలో మ్యాలెట్, గేట్, బెల్, ఉడ్‌బాల్ ఉపయోగిస్తారు. బాల్‌ను కొట్టుటకు ఉడ్‌తో తయారు చేయబడి వున్న మ్యాలెట్‌ను వినియోగిస్తారు. ఎవరు తక్కువ షాట్స్‌లో బెల్స్ కలిగియున్న గేట్‌ను కొడుతారో వారిని విజేతగా ప్రకటిస్తారు. జిల్లా ఉడ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు శరత్‌కుమార్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. 2018లో ఉడ్‌బాల్ క్రీడ జిల్లాలో పరిచయమైంది. అప్పటి నుంచి 2018లో మదనపల్లె రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. తరువాత వరుసగా కర్నూలు, అనంతపురం జిల్లాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా జట్టులోని విద్యార్థులు ఉడ్‌బాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతున్నారు. పలు కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులు ఉడ్‌బాల్ ఆడేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆటలో ముందంజ గోవర్ధన్



మదనపల్లె పట్టణం క్రిష్ణారెడ్డి సిద్ధార్థ కాలేజీలో విద్యార్థి గోవర్ధన్‌రెడ్డి ఆటలతో పాటు చదువులో సైతం ముందంజలో ఉన్నాడు. క్రీడలపై ఆసక్తి ఉండటంతో ఉడ్‌బాల్ వైపు మొగ్గు చూపాడు. అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొన్ని గోల్డ్‌కప్ సాధించాడు. బీహార్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. పీడీ శరత్ శిక్షణలో క్రీడలో రాణిస్తానని గోరవ్ధన్ రెడ్డి చెబుతున్నాడు.

సత్తా చాటుతున్న మహేష్



మదనపల్లెకు చెందిన మహేష్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. నాగపూర్, ఛత్తీష్‌గడ్‌లలో జరిగిన జాతీయస్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్ కప్ సాధించాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రోత్సాహంతో ఉడ్‌బాల్‌పై ఆసక్తి పెరిగిందని మహేష్ తెలిపారు.

క్రీడా కుసుమం పద్మశ్రీ



మదనపల్లె పట్టణం జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న పద్మశ్రీ ఉడ్‌బాల్ క్రీడలో రాణిస్తోంది. చదువుతో పాటు ఆటల్లో ప్రతిభ కనబరుస్తోంది. బీహార్, నాగపూర్‌లలో జరిగిన జాతీయ స్థాయి ఉడ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. అనంతపురం, కర్నూలులలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్ కప్‌లను సాధించింది. తల్లిదండ్రుల సహకారం. పీడీ పోత్సాహంతో ఉడ్‌బాల్ క్రీడలో రాణిస్తున్నట్లు పద్మశ్రీ తెలిపింది.

ఆటలో దిట్ట గ్రీష్మ



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గుర్రం గ్రీష్మకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఎంతో ఇష్టం. పీడీ, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉడ్‌బాల్ క్రీడపై ఆసక్తి పెంచుకుంది. జిల్లా స్థాయి బాలికల జట్టుకు ఎంపికైంది. కర్నూలులో జరిగన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయి పోటీల్లో సత్తా చూపిస్తానని స్పష్టం చేస్తోంది.

రాణిస్తున్న భార్గవి



మదనపల్లె పట్టణం జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీకి చెందిన డిగ్రీ విద్యార్థిని భార్గవి ఉడ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది. కొత్త ఆట అయినప్పటికీ శరత్ సలహాలతో రాణిస్తోంది. నాగపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. బీహార్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. కాలేజీ అధ్యాపకులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉడ్‌బాల్‌లో మెరుగ్గా దుతున్నట్లు భార్గవి తెలిపింది.

ఉడ్‌బాల్‌లో జాతీయ స్థాయి ప్రతిభ



ఉడ్‌బాల్ ఆటలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో రాణిస్తున్నారు. ఇది ఒక వినూత్న క్రీడ. ఇటవల ఛత్తీష్‌గడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో మన జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. –శరత్‌నాయక్, జిల్లా ఉడ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి

సన్‌షేడ్ పైనుంచి పడి ఆర్‌ఎంపీ వైద్యుడి మృతి


బస్సెట్టి సుబ్రమణ్యం (ఫైల్)

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో నివాసం ఉంటున్న ఆర్‌ఎంపీ వైద్యుడు బస్సెట్టి సుబ్రమణ్యం (61) ప్రమాదవశాత్తు సన్‌షేడ్‌పై నుంచి జారిపడి మృతి చెందాడు. గురువారం సాయంత్రం సుబ్రమణ్యం తన ఇంటిపై నుంచి సన్‌షేడ్ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందకు జారిపడ్డాడు. తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోగా కుటుంబ సభ్యులు గమనించి ప్రైవేటు వాహనం ద్వారా రైల్వేకోడూరుకు చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా ముక్కు, చెవి నుంచి రక్తస్రావమై మృతి చెందాడు. దశాబ్దాలుగా మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ వైద్యుడిగా సుబ్రమణ్యం ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. అందరిని ఆప్యాయంగా పలకరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతితో మండల కేంద్రంలోని సమీప గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య తులసి, కుమార్తె సుగుణ ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిపై కేసు నమోదు

వీరబల్లి : మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతున్న సీతంపేటకు చెందిన షేక్ పీరా అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఓదివీడు పంచాయతీలోని సీతంపేట వద్ద గురువారం స్థానిక ఎస్‌ఐ మోహన్ నాయక్ తన సిబ్బందితో వెళ్లి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇతనిని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

ఇరువర్గాలపై కేసు

మండలంలోని ఓదివీడు పంచాయతీ, దూల దళితవాడకు చెందిన పలక మనోహర్, పలక ఆంజనేయులు, అదే గ్రామానికి చెందిన దూల రమేష్, దూల రామానుజులు, దూల ఈశ్వరయ్య అనే ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు గురువారం స్థానిక ఎస్‌ఐ మోహన్ నాయక్ కేసు నమోదు చేశారు.

మా బిడ్డ మృతదేహం వెలికితీయరా.!


ఎన్‌హెచ్ 340 కడప-బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్తులు


బోరున విలపిస్తున్న మృతుడి తండ్రి సూరి

- పోలీసుల తీరుపై యువ ఇంజినీర్ బంధువులు, గ్రామస్తుల ఆగ్రహం
- జాతీయ రహదారిపై ధర్నా
- కన్నీరుమున్నీరైన మృతుడి తండ్రి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె సమీప క్వారీ నీటి గుంతల్లో ఈనెల 15న ఈతకెళ్లి మృతి చెందిన యువ ఇంజినీర్ బి.వెంకటరత్నం మృతదేహాన్ని రెండురోజులైనా పోలీసులు వెలికితీయలేదు. దీంతో ఆగ్రహించిన బంధువులు, గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. రెండు రోజులుగా పోలీసుల తీరు సరిగ్గా లేదంటూ మృతుడి తండ్రి రోడ్డుపై బోరున విలపించడం అందరినీ కలచివేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కనవారిపల్లెకు చెందిన బి. సూరి కుమారుడు బి. వెంకటరత్నం(25) సంక్రాంతి పండుగరోజున ఈనెల 15న దద్దాలవారిపల్లె క్వారీ గుంతల్లో స్నేహితులతో కలిసి సరదాగా ఈతకెళ్లి మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్‌కు 15 రోజుల్లో ఉద్యోగంలో చేరడానికి బయలుదేరి ఉండాల్సి ఉండగా ఈ దుర్ఘటన జరిగింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచి పీలేరు, వాల్మీకిపురం, రాయచోటికి చెందిన అగ్నిమాపక సిబ్బంది దద్దాలవారిపల్లె వద్ద ఉన్న క్వారీ నీటి గుంతల వద్దకు చేరుకున్నారు. తమ సామగ్రితో నీటి గుంతల్లో మొత్తం గాలింపు చర్యలు చేపట్టారు. గత రెండురోజులుగా గాలింపు చర్యలు ముమ్మరంగా నిర్వహించినా మృతదేహాన్ని పోలీసులు వెలికి తీయలేక పోయారు. పోలీసులు మళ్లీ ఇద్దరు గజ ఈతగాళ్లను నీటి గుంతల్లోకి దింపి మృతదేహాన్ని వెలికి తీసే ప్రయత్నాలు చేశారు. అయితే పోలీసుల చర్యలు రెండు రోజులుగా ఎలాంటి ఫలితాన్ని ఇవ్వలేదని మృతుడి బంధువులు ఆరోపించారు. యువ ఇంజినీర్ మృతి వార్త తెలుసుకుని కలకడ మండలం నుంచి బంధువులు, గ్రామస్తులు, స్నేహితులు పెద్ద ఎత్తున క్వారీ గుంతల వద్దకు చేరుకున్నారు. సాయంకాలం వరకు ఓపిక పట్టిన అందరూ ఒక్కసారిగా పోలీసులపై తిరగబడ్డారు. క్వారీ గుంతల పక్కనే ఉన్న ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారి, కడప–బెంగళూరు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు. అమరావతి నుంచి ఎస్‌డీఎస్ బలగాలను ఎందుకు పిలిపించలేదని అధికారులపై మండిపడ్డారు. నా బిడ్డ మృతదేహాన్ని బయటకు తీయడంలో పోలీసులు సహకరించడం లేదంటూ మృతుడి తండ్రి సూరి రోడ్డుపై బోరున విలపిస్తుంటే ప్రతి ఒక్కరూ చలించిపోయారు. వాల్మీకిపురం సీఐ ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ మధురామచంద్రుడులు ధర్నా చేస్తున్న వారితో చర్చలు జరిపినా ఫలితం కనిపించలేదు. చివరకు కర్నూలు నుంచి ఎస్‌డీఎస్ బలగాలను రాత్రికి దింపి మృతదేహాన్ని వెలికితీసే పనులు ముమ్మరం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కాగా రెండు రోజులైనా మృతదేహాన్ని క్వారీ నీటి గుంతల్లో నుంచి వెలికి తీయలేకపోవడంతో మృతుడి బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. యువకుడు నిజంగా నీటిలో మునిగి మృతి చెందాడా లేక క్వారీ వద్ద ఏమైనా జరిగిందా అన్న కోణంలో పోలీసులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మృతుడి బంధువులు పేర్కొంటున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని మార్పురి వీధిలో నివాసం ఉన్న జయప్రకాష్ (35) గత ఏడాది అక్టోబర్ 31న ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో, బుధవారం రాత్రి అతని భార్య అనిత టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

104 గ్యాస్ సిలిండర్లు సీజ్


గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసిన అధికారులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో 104 గ్యాస్ సిలిండర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గురువారం డీఎస్‌ఓ రఘురామ ఆధ్వర్యంలో గుర్రంకొండలో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్ల గోడౌన్లపై దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో హెచ్‌పీ కంపెనీకి చెందిన 104 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సివిల్ సప్లైస్ డీటీలు ఫజిల్, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ప్రజలు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కామనూరు గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన సీనియర్ క్యాటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఇందులో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎద్దు, నంద్యాల టౌన్ పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డికి చెందిన ఎద్దు కలసి పోటీలో పాల్గొని 3,643.09 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచి బుల్లెట్ ద్విచక్ర వాహనాన్ని కై వసం చేసుకున్నాయి. మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దులు 3,260.02 అడుగుల దూరం బండ లాగి రెండో స్థానంలో నిలిచి టీవీఎస్ అపాచి ద్విచక్రవాహనాన్ని గెలుపొందాయి.

ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు మూడో స్థానంలో నిలిచి టీవీఎస్ స్పోర్ట్స్ ద్విచక్రవాహనం, ప్రొద్దుటూరుకు చెందిన ద్వార్శల గురివిరెడ్డి ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి టీవీఎస్ ఎక్సెల్, గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన పులగం త్రిష్టారెడ్డి ఎద్దులు ఐదో స్థానంలో నిలిచి రూ.25వేలు నగదు బహుమతి అందుకున్నారు. ప్రొద్దుటూరు మండలం చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు ఆరో స్థానంలో నిలిచి రూ.15వేలు నగదు, మిగిలిన ఎద్దుల జతలకు కన్సొలేషన్ బహుమతి కింద ఒక్కో కాడికి రూ.5,116 గ్రామ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ ఎద్దుల పోటీలో యాంకర్లుగా ఓగేటి సురేంద్ర, చిరంజీవి వ్యవహరించారు.

పంచాయతీ అవినీతిపై విచారణ


రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

వేంపల్లె : వేంపల్లె గ్రామపంచాయతీలో జరిగిన అవినీతి ఆరోపణలపై ఆరుగురు కమిటీ సభ్యులతో విచారణ చేపట్టారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జమ్మలమడుగు డీఎల్‌పీఓ తిమ్మక్క ఆధ్వర్యంలో రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ 2023 సంవత్సరం నుంచి 2025 సంవత్సరం ఇప్పటి వరకు గ్రామ పంచాయతీలో పంచాయతీ ఈఓ వెంకట సుబ్బారెడ్డి అవినీతికి పాల్పడ్డారని టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో డీపీఓ రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీలు రామచంద్రారెడ్డి, షాకీర్ అలీఖాన్, శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు బషీర్, శ్రీనివాసులు, మాధవరెడ్డిలతో కమిటీ వేశారు. దీంతో అందుకు సంబంధించిన 15వ ఫైనాన్స్ కమిషన్, ఇంటి పన్ను, నీటి పన్ను, జనరల్ ఫండ్ టాక్స్, నాన్ టాక్స్ వసూళ్ల రికార్డులను పరిశీలించారు. అన్ని రికార్డులను జమ్మలమడుగు డీఎల్‌పీఓ కార్యాలయానికి తీసుకెళుతున్నామని తెలిపారు. ఇంకా కొన్నింటికి సంబంధించి రికార్డులు పరిశీలించాల్సి ఉందన్నారు. త్వరలో పూర్తి రికార్డులను పరిశీలించి, విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికలను పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈఓ వెంకట సుబ్బారెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గ పోరుతో అవినీతి ఆరోపణలు..?

పంచాయతీ కార్యాలయంలో టీడీపీ నాయకుడు బీటెక్ రవి వర్గానికి సంబంధించి 13 మంది వ్యక్తులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిన ఉద్యోగాలు వేసుకోవాలని కోరగా... మరో వర్గం టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తమకు సంబంధించి 9మంది వ్యక్తుల లిస్టు పంపారు. అందుకు ఈఓ సహకరించలేదని ఈఓపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. కలెక్టర్ అప్రూవల్ చేసినంతవరకు ఎవరిని కూడా కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగంలోకి తీసుకునే పరిస్థితి లేదు. రెండు వర్గాలు పోటీ పడడంతో అధికారులపై ఒత్తిడి పెరుగుతోందని.. ఒక వర్గానికి చేస్తే, మరో వర్గం ఇలా అవినీతి ఆరోపణలు అంటగట్టడం పరిపాటిగా మారుతోందని తెలుస్తోంది. దీంతో మండలంలోని అధికారులు ఏం చేయాలో దిక్కు తోచని పరిస్థితుల్లో తలలు పట్టుకుంటున్నారు.

వెంకటయ్య కుటుంబానికి న్యాయం చేయాలి


టీడీపీ నాయకుడి ఇంటి ఎదుట మృతదేహంతో కుటుంబీకులు


నక్కలదిన్నెలో టీడీపీ నాయకుడు ప్రసాద్ ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితి

చాపాడు: కనుమ పండుగ రోజైన బుధవారం నక్కలదిన్నె గ్రామ సమీపంలోని పంట పొలాల్లో బావిలో పడి మృతి చెందిన సంద్రా వెంకటయ్య(38)కుటుంబానికి న్యాయం చేయాలని గురువారం గ్రామంలో కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. నక్కలదిన్నెకు చెందిన టీడీపీ నాయకుడు ఎర్రిబోయిన ప్రసాద్ వల్లనే తన భర్త మృత్యువాత పడ్డాడని మృతుడి భార్య యశోద ఆరోపించారు. పోస్టుమార్టం అనంతరం వెంకటయ్య మృతదేహాన్ని నక్కలదిన్నెకు తీసుకువచ్చి ప్రసాద్ ఇంటి ఎదుట బాధిత కుటుంబీకులు, బంధువులతో పాటు గ్రామస్తులు ఆందోళన చేశారు. దీంతో టీడీపీ నాయకుడి ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. కనుమ రోజైన బుధవారం కొట్టాలపల్లెకు చెందిన సంద్ర వెంకటయ్య, నక్కలదిన్నెకు చెందిన టీడీపీ నాయకుడు ఎర్రిబోయిన ప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు కలసి పొలాల వద్ద విందు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో బావిలో వెంకటయ్య మృతి చెందాడు. వెంకటయ్య ఇంటికెళ్లే క్రమంలో బావి వద్ద శుభ్రం చేసుకునేందుకు వెళ్లి బావిలో పడ్డాడని, తాము గుర్తించి కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే నీటి లోపలికి వెళ్లాడని ప్రసాద్ చెబుతున్నాడు. ఇది సరి కాదని ప్రసాద్ వల్లనే తన భర్త మృతి చెందాడని, ఇంట్లో భోజనం చేస్తున్న తన భర్తను కావాలనే విందుకు తీసుకెళ్లారని వారి ప్రమేయం లేకుండా ఎలా బావిలో పడతాడని మృతుడి భార్య యశోద ప్రశ్నించింది. తన కుటుంబానికి న్యాయం జరిగితేనే తన భర్త మృత దేహానికి అంత్యక్రియలు చేస్తామని లేకుంటే ఇక్కడే ఉంచుతామని తేల్చి చెప్పింది. దీంతో గ్రామ పెద్దలు, బంధువులు ఇరు కుటుంబీకుల వారితో చర్చించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ చిన్న పెద్దయ్య సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటయ్య మృతి చెందిన ఘటనపై భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

బాకీ తీర్చమని అడిగితే దాడి

ఒంటిమిట్ట : తీసుకున్న అప్పును తిరిగి ఇవ్వమని అడిగినందుకు దున్నుతుల మనోహర్ రెడ్డిపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు దున్నుతుల మనోహర్ రెడ్డి అనే వ్యక్తి గతంలో చింతరాజుపల్లికి చెందిన రవి అనే వ్యక్తికి రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ఆ అప్పును తిరిగి ఇవ్వమని అడిగినందుకు దున్నుతల మనోహర్ రెడ్డిపై అప్పు తీసుకున్న రవి, శ్రీరామ్ అనే ఇద్దరు వ్యక్తులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

వేరుశనగ పంటపై అడవి పందుల దాడి

సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీ, రెడ్డివారిపల్లిలో రైతులు అంచల అశోక్, శంకర, రమాకాంత్ రెడ్డిలు సాగు చేసిన వేరుశనగ పంట పొలాల్లో బుధవారం రాత్రి అడవి పందులు దాడి చేశాయి. సుమారు ఏడు ఎకరాలు వేరుశనగ పంటను సాగు చేశామని అడవి పందుల దాడి కారణంగా నష్టం జరిగిందని రైతులు తెలిపారు. తమకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

ఉద్యోగాలు తొలగించి కడుపు కొడుతున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ఏపీఎండీసీలో ఉద్యోగాలు పీకేస్తూ కూటమి ప్రభుత్వం యువకుల కడుపు కొడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. ఏపీఎండీసీలో తొలగింపునకు గురైన కాంట్రాక్టు ఉద్యోగులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏపీఎండీసీలో స్థానికులకు ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడి 370 మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అలాగే రూ. 400 కోట్లతో మంగంపేట చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజలకు అనేక రకాలుగా లబ్ధి చేకూర్చామని తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎవరికీ ద్రోహం చేయలేదని మంగంపేట వాసులకు అన్ని రకాలుగా మేలు చేశామని తెలిపారు. ఉన్న ఉద్యోగాలు తీసేసి సీఎం చంద్రబాబు కొత్త ఉద్యోగాలు ఇస్తానంటే ఎవరైనా నమ్ముతారా అని ప్రశ్నించారు. ఏపీఎండీసీలో తొలగించిన ఉద్యోగులను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల్లో కరువైన సంక్రాంతి సంతోషం

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి


మాట్లాడుతున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

వీరబల్లి : పేద ప్రజల్లో సంక్రాంతి చిరునవ్వు కరువైందని, వారి ముఖాల్లో ఆనందం కనిపించలేదని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం వీరబల్లి మండలం గుర్రప్పగారిపల్లి పంచాయతీ కోనేటివారిపల్లిలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఇప్పటికీ అమలు చేయకపోవడం, అలాగే పేద ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అందకపోవడంతో వారి ముఖాల్లో చిరునవ్వు లోపించిందన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి పలు పథకాల ద్వారా ప్రతినెలా వారి ఖాతాలలో నగదు జమ చేసేవారన్నారు. దీంతో ఏ పండుగ వచ్చినా జగనన్న వేసిన నగదుతో చిరునవ్వుతో జరుపుకునే వారన్నారు. రైతు భరోసా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసి చివరకు సంక్రాంతి పండుగకు కూడా ఏ కానుక ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. ఇప్పటికే ప్రజలకు ఏ ప్రభుత్వం మంచిదో అర్థమైపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు రెడ్డి, సుబ్బరామరాజు, ఈశ్వరయ్య, మనిరాజు, చక్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన భారత్


గడికోట శ్రీకాంత్‌రెడ్డి


కొరముట్ల శ్రీనివాసులు

రాయచోటి (జగదాంబసెంటర్) / రైల్వేకోడూరు అర్బన్ : అంతరిక్ష పరిశోధనల్లో భారత్ సరికొత్త చరిత్ర సృష్టించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. స్పేడెక్స్ డాకింగ్‌తో అంతరిక్షంలోని రెండు ఉపగ్రహాల్ని అనుసంధానం చేయడంలో చరిత్రాత్మక విజయం సాధించిన ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన అభినందనలు తెలిపారు. స్పేస్ డాకింగ్ టెక్నాలజీలో అమెరికా, రష్యా, చైనా దేశాల తరువాత నైపుణ్యం సాధించిన నాల్గవ దేశంగా మన భారతదేశం నిలిచిందన్నారు. ఈ మైలురాయి భారతదేశ సామర్థ్యాలలో గణనీయమైన ముందడుగును సూచిస్తుందని, గొప్ప అంతరిక్ష కార్యక్రమాలు, మిషన్లకు మార్గం సుగమం చేస్తుందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల అంకితభావం, ఆవిష్కరణలు ప్రపంచాన్ని ప్రేరేపిస్తూనే ఉన్నాయని, ప్రతి భారతీయుడిని గర్వపడేలా చేస్తున్నాయన్నారు. ఈ ప్రయోగం విజయవంతం ద్వారా ప్రపంచంలో మన దేశ ఖ్యాతిని పెంచిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

మదనపల్లె : బైక్ అదుపుతప్పి ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం తెల్లవారుజామున చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. పలమనేరుకు చెందిన మురళి (20) స్థానికంగా పాలడెయిరీలో పనిచేస్తాడు. స్థానికంగా కోళ్ల ఫారంలో పనిచేస్తున్న భార్గవ్ (20), ట్రాక్టర్ కూలీగా పని చేస్తున్న మరో స్నేహితుడు బాలు (21)తో కలసి ద్విచక్ర వాహనంలో బుధవారం రాత్రి పలమనేరు నుంచి హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున రెండు గంటలకు పుంగనూరు మండలం ఈడిగపల్లె వద్ద బైక్ అదుపుతప్పి, వాహనంలోని ముగ్గురు స్నేహితులు పొలాల్లో పడిపోయారు. సుమారు నాలుగు గంటల సమయంలో గమనించిన స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్గవ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అంతర్ రాష్ట్ర బస్సు బోల్తా

- 11 మందికి గాయాలు
- తప్పిన పెను ప్రమాదం


కురబలకోట వద్ద ప్రమాదానికి గురైన మార్కాపురం ప్రైవేటు బస్సు

కురబలకోట : మదనపల్లె సమీపంలోని అంగళ్లు–జంగావారిపల్లె మార్గంలో గురువారం వేకువజామున అంతర్ రాష్ట్ర మార్కాపురం–బెంగళూరు ప్రైవేటు బస్సు జంగావారిపల్లె సమీపంలో బోల్తా పడింది. రోడ్డు డివైడర్‌ను ఢీకొని బస్సు బోల్తా పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో మార్కాపురం, గిద్దలూరు, కడపతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది గాయపడ్డారు. బస్సు అద్దాలను పగుల గొట్టి హుటాహుటిన వీరిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. సంక్రాంతి పండగకు ఇంటికి వచ్చి బెంగళూరుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఎక్కువ మంది బెంగళూరుకు వెళ్లే ఐటీ ఉద్యోగులు ఉన్నట్లు వెల్లడవుతోంది. ఈ సంఘటనలో క్లీనర్ సి. వెంకటనారాయణ, వినోద్, నవీన్ కుమార్, సాహితి, వినీత్, ఉమామహేశ్వర్ రెడ్డి, విక్రమ్, యశ్వంత్, వంశీ, కేశవరావు, నరసింహులు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.